

నేడు పరిష్కార వేదిక
కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు.



పరిహారం కోసం పోరాటం
జాతీయ రహదారి కోసం భూములు కోల్పోయిన రైతులు న్యాయమైన పరిహారం కోసం పోరుబాట పట్టారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
37.1°/22.2°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

అవకతవకలకు తావీయొద్దు



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: రేషన్ పంపిణీలో అవకతవకలకు తావీయరాదని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. ఆదివారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి రేషన్ షాపును కలెక్టర్ తనిఖీ చేసి, లబ్ధిదారులకు నిత్యావసరాలను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ సరుకులను ఆదివారం నుంచి రేషన్ షాపు వద్దే పంపిణీ చేస్తోందని చెప్పారు. డీలర్లు కార్డుదారులకు సరైన తూకాలతో సక్రమంగా నిత్యావసరాలను అందజేయాలన్నారు. పోస్టర్లు, ధరల బోర్డు, స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. 65 ఏళ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ అందజేయాలన్నారు. ప్రతి నెలా 15వ తేదీ వరకు ఆదివారాల్లో సైతం సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు



ధర్మవరంలో ఓ గోడౌన్‌లో భద్రపరిచిన విత్తన వేరుశనగ కాయలు

పుట్టపర్తి అర్బన్: సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల కోసం రైతులు సోమవారం నుంచి రైతు సేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ కోసం జిల్లాకు 63,918 క్వింటాళ్ల విత్తన వేరుశనగను ప్రభుత్వం కేటాయించిందన్నారు. కే6, టీసీజీఎస్-1694 రకం విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 30 కిలోల విత్తన వేరుశనగ బస్తా పూర్తి ధర రూ.2,790 కాగా 40 శాతం సబ్సిడీ పోనూ రైతు వాటాగా రూ.1,674 చెల్లించాలన్నారు. కదిరి లేపాక్షి రకం 30 కిలోల బస్తా పూర్తి ధర రూ.2,460 కాగా సబ్సిడీ పోనూ రైతు వాటా రూ.1,476 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అర ఎకరం వరకు 30 కిలోల బస్తా, అంతకు మించి ఎకరం వరకూ రెండు బస్తాలు, ఎకరం నుంచి ఆపైన భూమి ఉన్న రైతులకు గరిష్ఠంగా 3 బస్తాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ తీరు.. ప్రజల బేజారు

ఇంటి వద్దకే రేషన్.. వివిధ రకాల నిత్యావసర సరుకుల పంపిణీ.. ఇలా సజావుగా సాగిపోతున్న ప్రజా పంపిణీ వ్యవస్థను కూటమి సర్కారు అస్తవ్యస్తం చేసింది. పాత పద్ధతిలో అంటే చౌకధాన్యపు దుకాణం వద్దే రేషన్ సరుకుల పంపిణీని తీసుకొస్తూ ఇంటివద్దకే రేషన్ విధానాన్ని రద్దు చేసింది. దీంతో కూలీనాలీ చేసుకుని జీవనం సాగించే పేదలు పని మానుకుని సరుకుల కోసం గంటల తరబడి రేషన్‌షాపు వద్ద పడిగాపులు కాసే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ తీరుపై ప్రజలు బేజారు పడుతున్నారు.



రొద్దంలో ఓ రేషన్ షాపు వద్ద వృద్ధులు, మహిళల పడిగాపులు

- అస్తవ్యస్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ
- ఇంటి వద్దే రేషన్ పంపిణీ విధానానికి స్వస్తి
- చౌకదుకాణాల వద్దే బియ్యం పంపిణీ ప్రారంభం
- ఉదయం నుంచే షాపుల వద్ద లబ్ధిదారుల పడిగాపులు

సాక్షి, పుట్టపర్తి: గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేసింది. నిత్యావసర సరుకుల కోసం పేదలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఇంటివద్దకే రేషన్ బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు, గోధుమపిండి పంపిణీ చేసింది. అయితే టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేసే వ్యవస్థకు స్వస్తి పలికింది. అంతేకాకుండా వివిధ కారణాలతో కార్డుదారులకు పంచదార, గోధుమపిండి, కందిపప్పు పంపిణీ నిలిపివేసింది. బియ్యంతో మాత్రమే సరిపెడుతోంది. అది కూడా ఈ నెల నుంచి రేషన్ దుకాణం వద్దకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి.

ఉదయం నుంచి పడిగాపులు

ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో వృద్ధులు, మహిళలు రేషన్ సరుకులు తీసుకెళ్లేందుకు నానా తిప్పలు పడుతున్నారు. ఉదయం నుంచి చౌక దుకాణాల వద్ద బారులు తీరారు. ఎండలో ఇబ్బంది పడ్డారు. కొందరు పక్కనే ఉన్న వాహనాలు, చెట్ల కింద సేద తీరారు. మరికొన్ని చోట్ల రేషన్ షాపులు దూరంగా ఉండటంతో అక్కడి నుంచి సరుకులు మోసుకెళ్లలేక.. ఐదారుగురు కలిసి ఒకే వాహనంలో ఇంటి సమీపానికి చేరుకుంటున్నారు. ఇక వృద్ధులు, మహిళలు దూర ప్రాంతంలోని తమ ఇళ్లకు సరుకులు మోసుకెళ్లేందుకు అవస్థలు పడ్డారు. చేసేది లేక కొందరు బాడుగ ఆటో మాట్లాడుకుని తీసుకెళ్తున్నారు.

బ్లాక్‌లో అమ్ముకునేందుకేనా?

డీలర్‌షిప్‌లన్నీ తెలుగు తమ్ముళ్ల ఆధ్వర్యంలోనే ఉన్నాయి. పేదలకు సరుకులు సరిగా ఇవ్వకుండా బ్లాక్‌లో అమ్ముకుని అక్రమంగా ఆదాయం సంపాదించాలనే క్రమంలో అడ్డదారులు తొక్కుతున్నారు. ఫలితంగా కార్డుదారులకు ఇబ్బందులు పెడుతున్నారు. తమ్ముళ్ల కుమ్ములాటలో ఒక్కో పంచాయతీలో కార్డుల ఆధారంగా రెండు, మూడు దుకాణాలు వెలిశాయి. దీంతో తమ కార్డు ఎక్కడ ఉందో? ఏ దుకాణం వద్దకు వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో రేషన్ దుకాణాలు	1,367
జిల్లాలో రేషన్ కార్డుల సంఖ్య	5,62,784
ప్రతి నెలా పంపిణీ చేసే బియ్యం (మెట్రిక్ టన్నుల్లో)	8,700
ప్రతి నెలా పంపిణీ కావాల్సిన కందిపప్పు (కిలోలు)	5,72,517

అవ్వకు అష్టకష్టాలు



ఈ వృద్ధురాలు భీమరాయునిపేట గ్రామానికి చెందిన బ్యాల్ల నీలమ్మ. రేషన్‌కార్డులో ఈమెతో పాటు భర్త ఉన్నారు. వీరు రేషన్ బియ్యం కోసం గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుల్లానారాయణపల్లికి వెళ్లాల్సి వస్తోంది. ఆ గ్రామానికి వెళ్లడానికి బస్సు, ఆటో సౌకర్యం లేకపోవడంతో కాలినడకనే బయల్దేరింది. 65 ఏళ్ల వయసు మీద పడిన నీలమ్మ రేషన్ కోసం అష్టకష్టాలు పడి నడిచి వెళితే అక్కడ రద్దీ ఎక్కువగా ఉండటంతో గంటల కొద్దీ ఎదురుచూడాల్సి వచ్చింది. 'గతంలో ఇంటి వద్దే సరుకులు తీసుకునేవాళ్లం. ఈ వయసులో మాకు ఈ అగచాట్లు ఏమిటో అర్థం కావడం లేదు' అని నీలమ్మ వాపోయారు.

– తాడిమర్రి

దయ లేదా..?



ఈ వ్యక్తి పేరు కమాల్‌సాబ్. రొళ్ల సమీపాన మారుతి కాలనీలో నివాసం ఉంటున్నాడు. కుమారుడికి మతిస్థిమితం లేదు. వీరు అంత్యోదయ అన్న యోజన కార్డు కింద 35 కిలోల బియ్యం పొందుతున్నారు. ఇప్పటి వరకు ఎండీయూ ఆపరేటర్ వాహనంలో వచ్చి ఇంటి వద్దనే సరుకులు ఇచ్చేవారు. ప్రస్తుతం రేషన్ షాపువద్దే తెచ్చుకోవాలని చెప్పారు. వృద్ధాప్యం మీదపడిందని, ఇప్పుడు షాపువద్దకెళ్లి సరుకులు తెచ్చుకోలేని స్థితిలో ఉన్నానని కమాల్ సాబ్ ఇంట్లోనే ఉండిపోయాడు. మాలాంటి వారి కష్టాలను ప్రభుత్వం అర్థం చేసుకుని ఇంటివద్దకే అందివ్వాలని కోరుతున్నాడు.

–రొళ్ల

రాత్రి వరకు పడిగాపులు



అగళి మండలం రామాపురంలో ఆదివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలోనూ రేషన్ కోసం కార్డుదారులు నిరీక్షిస్తున్న దృశ్యమిది. సాంకేతిక సమస్యలతో గ్రామంలో రేషన్ పంపిణీ తీవ్ర ఆలస్యమైంది. రాత్రయినా రేషన్ అందకపోవడంతో ప్రజలు అసహనానికి గురయ్యారు. చివరకు వారికి రేషన్ ఇవ్వకుండానే.. 'రేపు రండి' అంటూ ఇళ్లకు పంపించివేశారు.

– అగళి

తూకంలో కోత



స్కేలుపై గోనెసంచిని ఉంచి తూకం వేస్తున్న దృశ్యం

రొద్దం మండలం బొక్సంపల్లిలో కార్డుదారులు రేషన్ కోసం ఆదివారం ఉదయాన్నే చౌకధాన్యపు దుకాణం వద్దకు చేరుకున్నారు. అయితే అక్కడ సిగ్నల్ తగలకపోవడంతో ఈ-పోస్ మిషన్ మొరాయించింది. సిగ్నల్ కోసం కార్డుదారులను డీలర్ మిద్దెపైకి ఎక్కించాడు. ఈ షాపు పరిధిలో 280 కార్డులు ఉన్నాయి. ఇదివరకు ఎండీయూ వాహనం ఇంటివద్దకు వచ్చినపుడు సిగ్నల్ సమస్య లేదు. సాఫీగా పంపిణీ చేసేవారు. ఇప్పుడు మాత్రం ఇలా ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ కార్డుదారులు వాపోయారు. దీనికి తోడు బియ్యం తూకంలో కోత విధిస్తున్నారని లబ్ధిదారులు తెలిపారు. స్కేల్‌పై దాదాపు కిలో బరువు ఉన్న ఖాళీ గోనెసంచిని ఉంచి బియ్యం తూకం వేస్తున్నారని చెప్పారు.

– రొద్దం

సులువుగా మోసం..



రేషన్‌షాపుల నిర్వాహకులు ప్రజలను సులువుగా మోసం చేసినా తెలుసుకోలేరు. గత ప్రభుత్వ హయాంలో బియ్యం వేసే స్కేల్‌కు, మిషన్‌కు కనెక్షన్ ఉండేది. ఒక లబ్ధిదారుడికి 20 కేజీల బియ్యం వేయాలంటే తూకంలో 20 కేజీల బియ్యం పెడితేనే మిషన్‌లో ప్రింట్ వచ్చేది. ఒక్క గ్రాము బియ్యం తగ్గినా మిషన్‌లో ప్రింట్ రాదు. దీంతో ప్రతి లబ్ధిదారునికీ కచ్చితంగా బియ్యం చేరేది. కానీ ప్రస్తుత ప్రభుత్వం డీలర్లకు లాగిన్ సదుపాయం కల్పించింది. స్కేల్‌లో 20 కేజీల బియ్యం వేయకుండా 10 కేజీల బియ్యం పెట్టి మిషన్‌లో 20 కేజీల బియ్యం కొడితే ప్రింట్ వస్తుంది. దీంతోపాటు స్కేల్‌లో బియ్యం పెట్టకుండా లబ్ధిదారుడితో వేలిముద్ర వేయించుకుని 20 కేజీల బియ్యం ఇచ్చినట్లు మిషన్‌లో టైపు చేస్తే బియ్యం ఇచ్చినట్లే లెక్క. ఇంత జరుగుతున్నా తూనికలు, కొలతల శాఖ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

– ప్రతాప్‌రెడ్డి, ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ధర్మవరం

ప్రతి కుటుంబానికీ రూ.లక్ష బాకీ

- హామీల అమలులో కూటమి సర్కారు అట్టర్‌ఫ్లాప్
- అధికారమిచ్చిన ప్రజలకు వెన్నుపోటు పొడిచారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ రమేష్‌రెడ్డి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ రమేష్‌రెడ్డి, సమన్వయకర్త దీపిక తదితరులు

చిలమత్తూరు: హామీలు అమలు చేయని కూటమి సర్కారు రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ రూ.లక్ష బాకీ పడిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. వాగ్దానాలు చేసి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను వంచించిన పాలకు తీరుపై ఈ నెల నాలుగో తేదీన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం' పేరుతో నిర్వహించే నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం హిందూపురం కార్యాలయంలో వారు నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపికతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్, రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి పూర్తి అవగాహన ఉన్న చంద్రబాబు అధికారంలోకి రావడం కోసం 'సూపర్ సిక్స్' హామీలు ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆ హామీలను తుంగలో తొక్కి ప్రజలను నిలువునా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాలు అమలు చేసి ఉంటే ఏడాదిలో ఒక్కో కుటుంబానికి రూ.లక్ష దాకా లబ్ధి చేకూరేదని, ఇప్పటికైనా ప్రభుత్వం ఆ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అబద్ధపు హామీలతో చంద్రబాబు ఎలా వంచించారో 'వెన్నుపోటు దినం'లో ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కక్షలకే ప్రాధాన్యం

కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా మోసం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల నాలుగో తేదీన హిందూపురంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మధుమతిరెడ్డి, పార్టీ నియోజకవర్గ ముఖ్యనేత వేణురెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.ఎ.శివ, జిల్లా అధికార ప్రతినిధి శివశంకర్‌రెడ్డి, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జబీఉల్లా, చిలమత్తూరు, లేపాక్షి మండల కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, సయ్యద్ నిస్సార్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్‌గౌడ్, నాగరాజు, వాల్మీకి లోకేష్, జిల్లా నేతలు గిరీష్, దిలీప్, శ్రీనివాసరెడ్డి, రోషన్ అలీ పార్టీ నేతలు పాల్గొన్నారు.

విద్యాశాఖలో బదిలీ'లీలలు'

- సీనియారిటీ ఉన్నా పదోన్నతికి దూరం
- స్కూల్ అసిస్టెంట్‌లు ప్రైమరీ స్కూళ్లకు..
- కొందరికి ఇష్టారాజ్యంగా పాయింట్లు

కదిరి: విద్యాశాఖలో టీచర్ల బదిలీల్లో చిత్రవిచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఎంతోమంది ఉపాధ్యాయులకు తీరని నష్టం కలిగిస్తున్నాయి. 20 నుంచి 30 ఏళ్ల సీనియారిటీ ఉన్న ఎస్‌జీ టీచర్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పోస్టుకు అనర్హుడని, కొత్తగా డీఎస్సీ ద్వారా నియమింపబడే వ్యక్తి అర్హుడంటే ఎలా? పలువురు ప్రశ్నిస్తున్నారు.

పాయింట్ల మాయాజాలం

8 ఏళ్లు ఒకే పాఠశాలలో పని చేసిన ఎస్‌జీ టీచర్లు ఇప్పుడు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. వీరికి ఒక్కో ఏడాదికి 3 పాయింట్లు చొప్పున 8 ఏళ్లకు 24 స్టేషన్ పాయింట్లు కేటాయిస్తారు. అయితే కొందరికి 29 స్టేషన్ పాయింట్లు వచ్చాయి. కొందరైతే భర్తతో కలిసున్నా 'ఒంటరి మహిళ' అని చూపారని, ఇంకొందరు స్కౌట్స్ అండ్ గైడ్స్ పేరుతో తప్పుడు ధ్రువపత్రాలు పెట్టి అక్రమ పాయింట్లు పొందారని, మరికొందరు తమకు వినికిడి లోపం అంటూ తప్పుడు పత్రాలు చూపి అధిక పాయింట్లు తెచ్చుకొని బదిలీల్లో ముందు వరసలో ఉన్నారని తోటి ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. సీనియారిటీ విషయంలో టీచర్ పుట్టిన తేదీ లేదా ఉద్యోగంలో చేరిన తేదీ లేదంటే డీఎస్సీలో మెరిట్.. ఇలా దేన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారో కూడా అర్థం కాని పరిస్థితి. అలాగే ఎస్‌జీ టీచర్లకు ఆఫ్‌లైన్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పిన ప్రభుత్వం ఈ నెల 7 నుంచి ఆన్‌లైన్ ద్వారా పాఠశాలల ఎంపికకు ఆప్షన్స్ ఇచ్చుకోవాలని మార్గదర్శకాల్లో ఎందుకు పేర్కొందని ప్రశ్నిస్తున్నారు.

బాబు కన్నా జగనే బెటర్!

గత ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగించింది. కానీ తెలుగు మీడియం ఎత్తేస్తున్నారని అప్పట్లో కొందరు తప్పుడు ఆరోపణలు చేశారు. కానీ ఈ ప్రభుత్వం సమాంతర తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా లేకుండా చేస్తోంది. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి కూడా గతంలో 1:40 ఉంటే ఇప్పుడు 1:49కు పెంచి టీచర్ల మిగులుగా ప్రభుత్వం చూపుతోంది. ఫలితంగా కొన్ని పాఠశాలలు కనుమరుగవుతున్నాయి. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతుల పిల్లలకు సబ్జెక్ట్ టీచర్లు బోధిస్తే మంచి ఫలితాలు వస్తాయన్న సదుద్దేశంతో వారిని సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలలకు పంపింది. అయితే దీన్ని అప్పట్లో కొందరు వ్యతిరేకించారు. తమను 3, 4, 5 తరగతులకు పాఠాలు చెప్పమంటే ఎలా? అని కొందరు స్కూల్ అసిస్టెంట్‌లు సైతం అప్పట్లో తప్పుబట్టారు. తాము అధికారంలోకి రాగానే ఇందుకు సంబంధించిన జీఓను రద్దు చేస్తామని చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేష్ ఎన్నికల సమయంలో పదేపదే చెప్పారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం 2025-26 విద్యాసంవత్సరం నుంచి 9 రకాల పాఠశాలలను ప్రవేశపెడుతోంది. వీటికి అనుకూలంగానే ఇప్పుడు బదిలీల ప్రక్రియ కూడా జరుగుతోంది. ఇందులో భాగంగా కొన్ని చోట్ల 1వ తరగతి నుంచే స్కూల్ అసిస్టెంట్‌లు బోధించాల్సి ఉంటుంది. దీన్ని జీర్ణించుకోలేని టీచర్లు కొందరు చంద్రబాబు కన్నా జగనే బెటర్..అని అంటున్నారు.

పింఛన్ డబ్బుతో ఆన్‌లైన్ బెట్టింగ్!

- వెల్ఫేర్ అసిస్టెంట్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంపీడీఓ



గుడిబండ: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసైన ఓ వెల్ఫేర్ అసిస్టెంట్ పింఛన్ డబ్బును వాడేసుకున్నాడు. ఫలితంగా తన పరిధిలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ ఆగిపోయింది. గుడిబండ మండలం గుణేమోరుబాగల్ పంచాయతీలో ఈ సంఘటన వెలుగు చూసింది. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున సామాజిక భద్రత పింఛన్ పంపిణీకి సంబంధించి మే 30న బ్యాంకు నుంచి రూ.1.82 లక్షల నగదు డ్రా చేశాడు. ఒకటో తేదీ ఆదివారం సెలవురోజు కావడంతో మే 31 శనివారం నుంచే పింఛన్‌ను పంపిణీ ప్రారంభమైంది. అయితే వెల్ఫేర్ అసిస్టెంట్ తన పరిధిలోని లబ్ధిదారుల్లో ముగ్గురికి మాత్రమే పింఛన్ పంపిణీ చేశాడు. అనంతరం సర్వర్ పనిచేయలేదని, రేపు పంపిణీ చేస్తామని చెప్పాడు. అయితే ఆదివారం పింఛన్ పంపిణీ చేయలేదు. లబ్ధిదారులు కార్యాలయానికి వస్తే అతడు అందుబాటులో లేడు. తమకు పింఛన్ ఇవ్వలేదని పలువురు మండలస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ పింఛన్ డబ్బును సొంతానికి వాడుకున్నట్లు.. ఆ మొత్తాన్ని ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టి పోగొట్టుకున్నట్టు తేలింది. ఈ మేరకు ఎంపీడీఓ కేశవరెడ్డి వెల్ఫేర్ అసిస్టెంట్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఈ వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున ఆన్‌లైన్ బెట్టింగ్ మోజులో పడి పింఛన్ డబ్బులు పోగొట్టినట్లు సమాచారం. క్రమశిక్షణా చర్యల కింద సెట్బూరు నుంచి గుణేమోరుబాగల్‌కు బదిలీ చేసినట్లు తెలిసింది.

బోగస్‌పై కలెక్టర్ దృష్టి

- టీచర్ల ప్రిఫరెన్షియల్ కేటగిరీ విచారణకు ఆదేశం
- స్టేషన్ పాయింట్లు ఎక్కువ వేసుకోవడంపైనా ఆరా

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: బోగస్ సర్టిఫికెట్లతో ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పొందాలని చూస్తున్న కొందరి టీచర్ల వ్యవహారంపై కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టి సారించారు. కొందరు టీచర్లు బోగస్ సర్టిఫికెట్లతో పాయింట్లు పొందుతున్న వైనంపై 'సాక్షి'లో వరుసగా 'పాయింట్లపై ఫిర్యాదుల వెల్లువ' 'స్టేషన్ పాయింట్ల నమోదులో ఇష్టారాజ్యం' శీర్షికలతో ప్రచురించిన కథనాలకు కలెక్టర్ స్పందించారు. ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబుతో మాట్లాడారు. స్పౌజ్, పీహెచ్, లీగలీ సపరేటెడ్ తదితర అంశాల్లో అర్హత లేకున్నా బోగస్ సర్టిఫికెట్లతో ప్రిఫరెన్షియల్ కేటగిరీకి చేరారనే విషయాలపై డీఈఓను ఆరా తీశారు. అలాగే మరికొందరు టీచర్లు స్టేషన్ పాయింట్లు నమోదులోనూ ఇష్టానుసారంగా వేసుకున్నారనే అంశంపైనా ఆరా తీశారు. మెడికల్ సర్టిఫికెట్లతో పాటు స్టేషన్ పాయింట్ల వ్యవహారంపై క్షుణ్ణంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో కలెక్టర్ పేరుతో జారీ చేసిన సర్క్యులర్ విద్యాశాఖ, ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతోంది.

లేని రోగాలను సృష్టించుకుని...

అనువైన స్థానాల్లో చేరేందుకు అడ్డదారులు ఎన్నుకున్నారు. లేని రోగాలను సృష్టించుకుని, తక్కువ శాతం ఉన్న వైకల్యాలను ఎక్కువ శాతం చూపిస్తూ, అన్ని అవయవాలూ సక్రమంగా పని చేస్తున్నా పైరవీలు చేసి తెచ్చుకున్న బోగస్ వైద్య ధ్రువీకరణపత్రాలతో 'ప్రిఫరెన్షియల్' కేటగిరి, 'స్పెషల్' పాయింట్లు పొందేందుకు పన్నాగం రచించారు. ఈ క్రమంలో గత కౌన్సెలింగ్‌లో జనరల్ కేటగిరీల్లో ఉన్న చాలామంది ఈసారి ప్రిఫరెన్షియల్ కేటగిరీ, ప్రత్యేక పాయింట్ల జాబితాల్లో చేరారు. ఉద్యోగంలో చేరినప్పుడు వైకల్యం ఉన్నవారితో పాటు నిజంగా ప్రమాదవశాత్తూ, మరేదైనా కారణాలతో మధ్యలో వైకల్యం పొందిన వారినీ ఎవరూ అభ్యంతరం చెప్పరు. అయితే వయసు రీత్యా కాస్త వినకపోవడం, కంటిచూపు తగ్గడం సహజం. ప్రమాదవశాత్తూ కిందకు పడినప్పుడు చిన్నచిన్న సర్జరీలు చేసుకోవడం కూడా సహజమే. అయితే వీటినే పెద్ద బూచీగా చూపిస్తూ అడ్డగోలుగా పాయింట్లు పొందుతున్నారు. వీరి వ్యవహారంపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు.



ఆన్‌లైన్‌లో జాబితాను పరిశీలిస్తున్న డీఈఓ

ఎంఈఓలతో సమావేశమైన డీఈఓ

ఇదిలాఉండగా ఆదివారం స్థానిక శారదా నగర పాలక ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంఈఓలతో డీఈఓ ప్రసాద్‌బాబు సమావేశం ఏర్పాటు చేశారు. పాతస్టేషన్ పాయింట్ల నమోదులు ఎక్కువగా ఎస్జీటీలే వాడుకున్నారని ఇందుకు ఎంఈఓలదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. గరిష్ఠంగా 24కు మించి అర పాయింటు కూడా ఎక్కువ ఉండకూడదన్నారు. స్టేషన్‌పాయింట్లు, రీఆపోర్స్‌మెంట్‌కు గురైన టీచర్లు పాయింట్లు ఇష్టానుసారంగా వేసుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి టీచరును పిలిపించి విచారించి పాయింట్ల నమోదులో తేడా ఉంటే సరి చేయాలన్నారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్ల నమోదును జాగ్రత్తగా ఒకటిరెండు సార్లు పరిశీలించాలన్నారు. గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. పూర్తయిన తర్వాత కూడా ఎవరికైనా నిబంధనలకు విరుద్ధంగా పాయింట్లు ఉన్నట్లయితే సదరు టీచరుతో పాటు ఎంఈఓలపైనా చర్యలుంటాయని డీఈఓ స్పష్టం చేశారు.

క్లుప్తంగా

ద్రోహులను పార్టీ ఉపేక్షించదు

- పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్‌సీపీలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పార్టీ క్రమ శిక్షణ నూతన కమిటీని అధిష్టానం నియమించిందన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చైర్మన్‌గా ఉన్న కమిటీలో సభ్యులుగా తనతో పాటు తానేటి వనిత, రెడ్డి శాంతి, అనిల్‌కుమార్ ఉన్నారన్నారు. ఇటీవల జరిగిన కమిటీ తొలి సమావేశంలో కొన్ని తీర్మానాలు, నిర్ణయాలు, విధివిధానాలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆశయం మేరకు ప్రజలతో పార్టీ కేడర్ ఉండాలన్నారు. పార్టీకి వెన్నుపోటు పొడిచినా, ఇతర పార్టీలతో లోపాయికారి ఒప్పందాలు చేసుకున్న వారిలో పార్టీ మార్పు కోరుతోందని, అయినా వారు మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న 125 మందిపై చర్యలు తీసుకోగా, ఇందులో తన సొంత నియోజకవర్గానికి చెందిన ఐదుగురు ఉన్నారన్నారు. బహిష్కరణకు గురైన వారిలో మార్పు రాకుండా అదే పంథాను కొనసాగిస్తుంటే మాత్రం చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. వారిని సమర్థించే నాయకత్వం పైన కూడా చర్యలుంటాయన్నారు.

యువకుడి దుర్మరణం



అమర్‌నాథ్ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మండలంలోని చందమూరు వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం మండలం బడన్నపల్లికి చెందిన అమరనాథ్ (25), ధర్మవరం నివాసి మహబూబ్‌బాషా ఆదివారం ద్విచక్ర వాహనంపై ఎన్‌ఎస్‌గేట్‌కు వచ్చారు. పని ముగించుకున్న అనంతరం ధర్మవరానికి తిరుగు ప్రయాణమయ్యారు. చందమూరు సమీపంలోకి చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో అమరనాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మహబూబ్‌బాషాను అటుగా వెళుతున్న వారు గమనించి ఓ ప్రైవేట్ వాహనంలో ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై సీకే పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత బలవన్మరణం

యాడికి: స్థానిక చౌడేశ్వరి కాలనీకి చెందిన వివాహిత ధనలక్ష్మి (35) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... చేనేత పనులతో జీవనం సాగిస్తున్న ధనలక్ష్మి, తిరుపతయ్య దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకునేవి. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇదీ జనమెరిగిన సత్యం

ధర్మవరం.. దుర్గంధమయమైంది. ఎటు చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో పారిశుధ్యం మెరుగుకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గతంలో ఎన్నడూ ఇంతటి దుర్భర స్థితిని చూడలేదని... సాక్షాత్తు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఇలాకాలోనే పరిస్థితి ఇలా ఉంటే... ఇక రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటోందో ఊహించుకోలేకపోతున్నామని స్థానికులు అంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



పుట్టపర్తికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన పడేసిన చెత్త



తారక రామాపురం కాలనీలో పందుల స్వైరవిహారం



ఎంఈఓ కార్యాలయం వద్ద పేరుకుపోయిన అపరిశుభ్రత

ఇరు కుటుంబాల ఘర్షణ

- రాజకీయ రంగు పులిమిన పచ్చ నేతలు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కేసు బనాయించేలా కుట్ర



దాడిలో సొమ్మసిల్లిపోయిన రాజు

తాడిపత్రి టౌన్/పెద్దపప్పూరు: నియోజకవర్గంలో టీడీపీ నాయకుల నీచ రాజకీయాలు పరాకాష్టకు చేరాయి. పెద్దపప్పూరు మండలం తిమ్మనచెరువులో ఇరు కుటుంబాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణకు రాజకీయ రంగు పులిమి వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు బనాయించి పైశాచిక ఆనందాన్ని పొందారు. వివరాలు.. తిమ్మనచెరువు గ్రామానికి చెందిన తలారి ఆంజనేయులు ఆదివారం గ్రామ దేవతలకు మొక్కు చెల్లించి విందు ఏర్పాటు చేసాడు. కార్యక్రమానికి అదే గ్రామానికి చెందిన ఓబులేసు కుటుంబసభ్యులూ హాజరయ్యారు. కాగా, ఓబులేసుకు కుమార్తె రత్నమ్మ, కుమారులు రాజు, నాగేంద్ర, ఓబులేసు ఉన్నారు. రత్నమ్మకు 15 సంవత్సరాల క్రితమే వివాహమైంది. కుమార్తె కుటుంబానికి తండ్రికి మధ్య చాలా కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో విందు కార్యక్రమంలో ఇరు కుటుంబాలు తారసపడి ఘర్షణకు దిగాయి. రత్నమ్మపై తండ్రి ఓబులేసు, తమ్ముడు రాజు చేయి చేసుకున్నారు. దీంతో రత్నమ్మ భర్త చిన్నరంగయ్య, ఆమె బావ పెద్దరంగయ్య, కొడుకు మనోజ్ వెంటనే ఓబులేసు, రాజుపై కర్రలతో, పైపులతో దాడి చేశారు. తండ్రిని, అన్నను కొడుతున్నారన్న విషయం తెలుసుకున్న నాగేంద్ర, ఓబులేసు వెంటనే అక్కడకు చేరుకుని చిన్న రంగయ్య, పెద్ద రంగయ్య, మనోజ్‌పై కొడవలి, కర్రలతో ప్రతి దాడికి దిగారు. ఘటనలో వీరితో పాటు బంధువులు కిట్ట, వేణుకూ గాయాలయ్యాయి. క్షతగాత్రులను కుటుంబసభ్యులు తొలుత తాడిపత్రిలోని ఆస్పత్రికి, అనంతరం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఓబులేసు కుమారుడు రాజు అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వేమనాథరెడ్డి కారు డ్రైవర్ కావడంతో టీడీపీ నాయకులు వెంటనే రాజకీయ రంగు పులిమి ఆ పార్టీ నేతలపై దాడులు చేశారంటూ వివాదానికి తెరలేపారు. అక్కడితో ఆగకుండా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కేసులు నమోదు చేసేలా పోలీసులపై ఒత్తిళ్లు తీసుకెళ్లారు. కాగా, ఘటనకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పరిహారం కోసం పోరాటం

- ఎకరా రూ.కోటి విలువైన భూమికి రూ.12 లక్షలు చెల్లించాలని నిర్ణయం
- పరిహారం మొత్తం పెంచాలని అన్నదాతల డిమాండ్



ఆదివారం రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో ముదిగుబ్బ -పుట్టపర్తి జాతీయ రహదారి పనులను అడ్డుకుంటున్న రైతులు

ముదిగుబ్బ: భూ పరిహారం కోసం రైతులు పోరు బాట పట్టారు. ఎకరా రూ.కోటి విలువైన భూమికి రూ.12 లక్షల మాత్రమే చెల్లించాలని నిర్ణయించడాన్ని అన్నదాతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమకు పరిహారం ఇచ్చిన తర్వాత పనులు చేపట్టాలంటూ పనులు అడ్డగిస్తున్నారు. వివరాలు.. ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి ఎన్‌హెచ్ 342 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గత ప్రభుత్వం మొదటి విడతలో 138.59 ఎకరాలను సేకరించి రైతుల ఖాతాల్లో రూ.16,27,50,029 మొత్తాన్ని జమ చేసింది. అయితే అక్కడక్కడ మిగిలిపోయిన భూములకు, ముదిగుబ్బ బైపాస్ నుంచి కొంత దూరం వరకు సర్వీసు రోడ్డు నిర్మాణం కోసం గుంజేపల్లి, దొరిగిల్లు, మంగళమడక, నక్కలగుట్టపల్లి పొలాల్లో రెండో విడతగా 16.69 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది.

పట్టించుకోని ప్రభుత్వం

రెండో విడత సేకరించిన భూమికి ప్రస్తుత ప్రభుత్వం సరైన ధర ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు. గుంజేపల్లి పొలానికి ఎకరానికి రూ.12.5 లక్షలు, దొరిగిల్లు పొలానికి రూ.7.5 లక్షలుగా నిర్ణయించింది. అయితే తమ భూములు మండల కేంద్రానికి దగ్గరగా ఉన్నాయని, వాటి ధర ఎకరం రూ.కోటి పలుకుతోందని రైతులు చెబుతున్నారు. కోట్లాది రూపాయల విలువైన భూమికి రూ.లక్షల్లో పరిహారం ఇస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం పరిహారం పెంచి తమకు న్యాయం చేసేదాకా పనులు జరగనివ్వమని వారు తెగేసి చెబుతున్నారు.

బోరు బావులున్న భూములను ఎలా ఇస్తాం?



నిత్యం బోరు నీళ్లతో పంటలు పండించుకుంటు జీవనం సాగిస్తున్న మా భూమిని రోడ్డు నిర్మాణం కోసం అన్నదమ్ములకు చెందిన 2.15 ఎకరాలను కోల్పోతున్నాం. మా పక్క భూమిలో ఎకరా రూ.కోటి వరకు విక్రయిస్తున్నారు. అలాంటి విలువైన భూమిని ఎకరానికి రూ.10 లక్షలకు ఎలా ఇస్తాం.

– సోమలప్రకాష్, రైతు, ముదిగుబ్బ

న్యాయమైన పరిహారం ఇవ్వాలి



రోడ్డు నిర్మాణంలో భాగంగా మాకున్న మూడు ఎకరాల్లో 85 సెంట్లు భూమిని కోల్పోతున్నాం. తక్కువ పరిహారం ఇచ్చి ప్రభుత్వం మా భూమిని లాక్కోవాలని చూస్తే ఎంత దూరమైనా పోరాడుతాం. మాకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి.

– ప్రభాకర్, రైతు, ముదిగుబ్బ

మార్కెట్ విలువ ప్రకారమే పరిహారం



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎకరాకు ఎంత మొత్తం నమోదైతే అంత మొత్తాన్ని మాత్రమే ప్రభుత్వ పరిహారంగా చెల్లిస్తుంది. అంతకు మించి ఎక్కువ పరిహారం కావాలంటే ఉన్నతాధికారులతో చర్చించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పెంచుకోవాలి.

– నారాయణస్వామి, తహసీల్దార్, ముదిగుబ్బ

వంచకుడిపై చర్యలు తీసుకోండి

గుమ్మఘట్ట: ప్రేమ పేరుతో తనను లోబర్చుకుని మోసం చేసిన యువకుడిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులను ఓ యువతి ఆశ్రయించింది. బాధితురాలు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం పూలకుంటకు చెందిన దంపతులకు ముగ్గురు కుమార్తెలు కాగా, కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. వీరి పెద్ద కుమార్తె కర్ణాటకలోని మొలకాల్మూరులో ఇంటర్ పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆమెను ప్రేమ పేరుతో సొంత గ్రామానికి చెందిన నాగప్ప, నాగమ్మ దంపతుల కుమారుడు సురేష్ లోబర్చుకున్నాడు. పెళ్లి పేరుతో మూడేళ్ల పాటు తన చుట్టూ తిప్పుకున్నాడు. ఆమె అడిగిన ప్రతిసారీ తన అన్న పెళ్లి జరిగేంత వరకూ ఓపిక పట్టాలని నచ్చచెబుతూ వచ్చాడు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం యువకుడి అన్నకు పెళ్లైంది. పది రోజుల క్రితం ఆమె నిలదీయడంతో యువకుడు ముఖం చాటేశాడు. దీంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకున్న ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఈ విషయంపై ఎస్‌ఐ ఈశ్వరయ్యను వివరణ కోరగా విచారిస్తున్నామని తెలిపారు.

పడిపోయిన నిమ్మ ధరలు

- బస్తా రూ.5వేల నుంచి రూ.1,500 లోపు
- ఆందోళనలో రైతులు



తాడిపత్రి మార్కెట్‌కు వచ్చిన నిమ్మబస్తాలు

తాడిపత్రి రూరల్: కేవలం రెండు వారాల వ్యవధిలో నిమ్మ కాయల ధరలు అమాంతం పడిపోయాయి. గత నెలలో బస్తా నిమ్మకాయల ధర రూ.5 వేలు ఉండగా ఆదివారం నాటికి రూ.1,000 నుంచి రూ.1,500కు పడిపోయింది. మారిన వాతావరణ పరిస్థితులు, కురుస్తున్న వర్షాల వల్ల నిమ్మ ధరలు తగ్గినట్లుగా తెలుస్తోంది.

నాలుగు మండలాల్లో విస్తారంగా నిమ్మ సాగు

తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి, పుట్లూరు మండలాలతోపాటు వైఎస్సార్ కడప జిల్లా సరిహద్దులోని రైల్వే కొండాపురం మండలంలోని పలు గ్రామాల్లో నిమ్మ సాగు విస్తారంగా ఉంది. ఆయా ప్రాంతాల నుంచి తాడిపత్రిలోని మార్కెట్ యార్డుకు నిమ్మ కాయలను మంగళ, శుక్ర, ఆదివారాల్లో రైతులు తీసుకువస్తుంటారు. బస్తాలో 1,000 నుంచి 1,100 వరకు నిమ్మకాయలు ఉంటాయి. కాయ నాణ్యత, సైజును బట్టి మూడు రకాలుగా విభజించి వేలం వేస్తారు. వేలంలో కొనుగోలు చేసిన వ్యాపారులు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ఇక్కడ ధర గిట్టుబాటు కాకపోతే రైతులు జిల్లాలోని పలు ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు.

మార్కెట్‌లో తగ్గిన నిమ్మకాయల ధరలు..

గత ఏడాది ఇదే సమయానికి నిమ్మ ధరలు రైతులకు కాస్త వెసులుబాటుగా ఉండేది. అప్పట్లో బస్తా రూ.2వేల నుంచి రూ.3వేల వరకు అమ్ముడుపోయింది. ఈ ఏడాది రుతు పవనాలు వారం రోజులు ముందుగా జిల్లాను పలకరించాయి. దీంతో ఆకాశం మబ్బులు కమ్ముకోవడం, వాతావరణ పరిస్థితులు చల్లబడటంతో నిమ్మ ధరలు అమాంతం పడిపోయినట్లుగా తెలుస్తోంది.

మరింత తగ్గుతాయి



నేను తాడిపత్రిలోని మార్కెట్‌లో డైలీ నిమ్మకాయలు అమ్ముతుంటాను. గత నెలలో రూ.20కి 5 కాయలు అమ్మేవాళ్లం. ఇప్పుడు రూ.10కే 5 కాయలు ఇస్తున్నాం. పరిస్థితి చూస్తుంటే నిమ్మ కాయల ధరలు మరింత తగ్గే అవకాశముంది.

– రసూల్‌బీ, వ్యాపారి, తాడిపత్రి

బస్సు దిగుతూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి మృతి

అనంతపురం: బస్సు దిగబోతు ప్రమాదవశాత్తు కిందపడి ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నగరంలోని బుడ్డప్ప నగర్‌లో నివాసముంటున్న షేక్ హాజీ అబ్దుల్ కరీం (83) ఆర్టీసీలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు భార్య ఫజులున్నీసా, ఇద్దరు కుమారులు. నలుగురు కుమార్తెలు ఉన్నారు. కళ్యాణదుర్గంలో నివాసముంటున్న పెద్ద కుమారుడి వద్దకు గత నెల 30న వెళ్లారు. మధ్యాహ్నం భోజనం ముగించుకున్న రాత్రి 7 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల వద్ద బస్సు దిగే సమయంలో ప్రమాదవశాత్తూ కింద పడి తలకు గాయమైన అబ్దుల్ కరీంను వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆదివారం ఆయన మృతి చెందారు. ఘటనపై మూడో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదంలో వివాహిత మృతి

రాయదుర్గం టౌన్: మండలంలోని కదరంపల్లి సమీపంలో చోట చేసుకున్న ప్రమాదంలో ఓ వివాహిత మృతి చెందింది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... ఆవులదట్ల గ్రామానికి చెందిన వివాహిత కవిత(28) ఆదివారం తన సోదరుడు నవీన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై గుండ్లపల్లికి బయల్దేరారు. కదరంపల్లి టోల్‌గేట్ సమీపంలోకి చేరుకోగానే వెనుకనే ఆర్‌బీ వంక గొల్లలదొడ్డి గ్రామం నుంచి కెంచానపల్లిలోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న శివప్ప ఢీకొన్నాడు. ప్రమాదంలో బలమైన గాయమైన కవితను ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందింది. నవీన్‌తో పాటు ప్రమాదానికి కారణమైన శివప్ప, అతని తాత ఉలెప్పకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆస్పత్రికి స్థానికులు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఉలెప్పను అనంతపురానికి తీసుకెళ్లారు. కాగా, మృతురాలు కవితకు భర్త నాగరాజు, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ బదిలీ

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ కర్నూలుకు బదిలీ అయ్యారు. ఆదివారం ఉదయం ఉత్తర్వులు రాగా...మధ్యాహ్నానికి ఆయన రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో వైఎస్సార్ కడప జిల్లాలో పనిచేస్తున్న వెంకటేశును నియమించారు.

జాతీయ స్థాయి పోటీల్లో మెరిసిన సోనాక్షి



బంగారు పతకాలను చూపుతున్న సోనాక్షి

అనంతపురం: సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ (ఎస్‌బీకేఎఫ్) ఆధ్వర్యంలో గోవా వేదికగా గత నెల 30 నుంచి రెండు రోజుల పాటు సాగిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో నిర్వహించగా.. రోలర్ స్కేటింగ్ విభాగంలో జిల్లాకు చెందిన చిన్నారి ప్రతిభ చాటింది. అండర్–5 కేటగిరిలో ఏకంగా రెండు బంగారు పతకాలను కైవసం చేసుకున్న బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన కె.వేణుగోపాల్, మౌనిక దంపతుల కుమార్తె సోనాక్షిని ఆమె చదువుతున్న మాంటిస్సోరి పాఠశాల యాజమాన్యం ఆదివారం అభినందించింది.

తెలుగు తమ్ముళ్ల దౌర్జన్యం



దౌర్జన్యంగా పగులగొట్టిన ప్రహరీ

అనంతపురం/అనంతపురం క్రైం: జిల్లా కేంద్రం చుట్టుపక్కల భూమి తమవేనంటూ తెలుగు తమ్ముళ్లు దౌర్జన్యానికి తెరలేపారు. బాధితులు తెలిపిన మేరకు... కక్కలపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 144/2ఏలో మొత్తం 1.76 ఎకరాల్లో ఆర్.కృష్ణారెడ్డి కుమారుడు హనుమంతరెడ్డికి 0.73 సెంట్లు, మహమ్మద్ షఫీ కుమారుడు సయ్యద్ షామీర్‌కు 0.58 సెంట్లు, మహేష్‌బాబు భార్య జి.విజయలక్ష్మికి 0.08 సెంట్లు, షేక్ మహబూబ్‌బాషా కుమారుడు షేక్ ఇమాం బాషాకు 0.08 సెంట్ల స్థలం ఉంది. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు గత 20 సంవత్సరాలుగా పక్కాగా ఉన్నాయి. వీటి ఆధారంగా బ్యాంక్ రుణాలు సైతం పొందారు. ఆ స్థలంలో నీటి బోర్లు, కాంపౌండ్ వాల్, షెడ్డు, డోర్ నంబర్లు, కరెంట్ బిల్లులూ ఉన్నాయి. గత నెల 28న సర్వేయర్ ఉమామహేశ్వర్ ఫోన్ చేసి హద్దులు చూపిస్తానని తెలపడంతో వారు హక్కుదారులు అక్కడకు వెళ్లారు. అప్పటికే ప్రహరీని జేసీబీతో కూల్చివేసి స్థలాన్ని కబ్జా చేసుకునే ప్రయత్నం సాగుతుంటే అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో అనంతపురం నియోజకవర్గ ప్రజాప్రతినిధికి చెందిన 50 మంది అనుచరులు దౌర్జన్యానికి దిగారు. ఆ భూమి తమదంటూ దుర్భాషలాడుతూ హక్కుదారులను పక్కకు లాగేశారు. బాధితులు వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని కూల్చివేతలను అడ్డుకున్నారు. కానీ, ఇప్పటి వరకూ దౌర్జన్యపరులపై ఎలాంటి చర్యలూ లేవు. అలాగే కియా కార్ల షోరూం వెనుక ఉన్న ఎకరాలోపు స్థలంలో కుటుంబ సభ్యులపై అనంతపురం, రాప్తాడు ప్రజాప్రతినిధులకు చెందిన ముఖ్య అనుచరులు దాడి చేశారు. నగరంలోని అరవిందనగర్‌కు చెందిన వెంకటేశ్ ప్రసాద్ గుప్తాకు చెందిన ఈ స్థలం అత్యంత విలువైనది. దీనిపై కన్నేసిన టీడీపీ నేతలు శనివారం ఆ స్థలం వద్దకెళ్లి కబ్జాకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న వెంకటేశ్ ప్రసాద్ గుప్తా, అతని కుమారులు ప్రణీత్, సాయినాథ్ అక్కడకు చేరుకోవడంతో టీడీపీ నేతలు దాడికి తెగబడ్డారు. ఘటనలో వెంకటేశ్ ప్రసాద్ గుప్తా చెవికి తీవ్ర గాయమైంది. బాధితులు డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో నాల్గో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే టీడీపీ నేతలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, తీవ్రంగా గాయపడిన వెంకటేష్ ప్రసాద్ ప్రస్తుతం కర్నూలులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై నాల్గోపట్టణ సీఐ కె.సాయినాథ్ మాట్లాడుతూ.. భూ వివాదాలపై ప్రాథమికంగా విచారణ చేపడతామన్నారు. బాధితులకు రాత్రి, ఉదయం ఫోన్ చేసి విచారణకు రావాలని సూచించామని, వారిచ్చే ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

యువరైతు ఆత్మహత్య

బ్రహ్మసముద్రం: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం పొబ్బర్లపల్లికి చెందిన బోయ నాగరాజు (35)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. తనకున్న ఐదు ఎకరాల పొలంలో పంటల సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.10 లక్షలకు చేరుకుంది. ఈ క్రమంలో సాగు చేసిన బూడిద గుమ్మడి, టమాట పంటలో దిగుబడులు లేక మరోసారి నష్టపోయాడు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదంటూ కుటుంబసభ్యులతో చెప్పుకుని బాధపడిన ఆయన శనివారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్ తెలిపారు.

టెంకాయపై భారం వేసి..



సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత రోజుల్లోనూ రైతులు పూర్వీకుల పద్ధతినే అనుసరిస్తున్నారు. తమ పొలాల్లో బోరు బావులు తవ్వాలనుకునే రైతులు ముందుగా టెంకాయపై భారం వేసి నీటి లభ్యతను పసిగడుతున్నారు. టెంకాయను అరచేతిలో పట్టుకుని నడుస్తుండగా అది పైకి లేచి కింద పడిన చోట బోరు తవ్వితే నీరు సమృద్ధిగా లభ్యమవుతుందని నమ్మకం. ధర్మవరం సమీపంలోని ఓ రైతు పొలంలో భూగర్భ జలం కోసం అన్వేషిస్తున్న ఈ దృశ్యం అటుగా వెళుతున్న వారిని ఆశ్చర్యపరిచింది. దీంతో కాసేపు తమ వాహనాలను ఆపి ఆసక్తిగా గమనించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం: